క్లుప్తంగా

నేటి నుంచి బద్రొద్దీన్ షావలి ఉర్సు

ఖిల్లాఘనపురం: మండల పరిధిలోని తిర్మలాయపల్లి గ్రామ శివారులో ఉన్న బద్రొద్దీన్‌షావలి దర్గా ఉర్సు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లి బద్రొద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఆదివారం గంధోత్సవం (సందల్) 25న సోమవారం ఉర్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

అమరచింత: పార్టీకోసం పనిచేస్తున్న కార్యకర్తలకు పార్టీ పరంగా ఆదుకోవడానికి ముందుంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన సాక వెంకటేశ్, సాక భాస్కర్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో శనివారం వారిని పరామర్శించారు. వైద్యసేవల అందించడానికి తమ వంతు కృషి చేస్తామని, వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేర్వరాజు, క్యామ భాస్కర్, బీమ్సేన్, అజిత్ రెడ్డి, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కొత్తకోట రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వం జీవో 28ను తీసుకొచ్చి ఆగస్టు 23న సీపీఎస్ కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. అదేవిధంగా గత ప్రభుత్వ కాలంలో ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ సీపీఎస్ రద్దు సాధ్యం కాలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బ్లాక్ డే నిరసన

వనపర్తి రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు చేయాలని టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దత్తాయిపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలసి బ్లాక్‌డే సందర్భంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం కొత్తగా ఏర్పడిన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధాన్ని కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ 2014 ఆగస్టు 23న జీవో నెంబర్ 28 జారీ చేసి కంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్) విధానాన్ని కొనసాగించి ఈ రోజును పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు.

వనపర్తి వాసికి డాక్టరేట్ ప్రదానం



వనపర్తిటౌన్: వనపర్తి పట్టణానికి చెందిన పరమేశ్వర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ 84వ కాన్వొకేషన్‌లో బొటాని విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు శనివారం తెలిపారు. బొటానిక్ విభాగంలో వికారాబాద్ జిల్లాలోని వృక్ష సముదాయ వైవిధ్యం అనే అంశంపై అధ్యాయనం చేసినందుకు గాను ఓయూ అధికారులు, ఇస్రో చైర్మన్ నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందజేసినట్లు పరమేశ్వర్ వెల్లడించారు.

'వెంకటేశ్వరరెడ్డికి అభినందనలు'

వనపర్తిటౌన్: జిల్లాకు చెందిన కోట్ల వెంకటేశ్వర రెడ్డి సారస్వత పరిషత్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో శనివారం సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ కోట్ల వెంకటేశ్వర రెడ్డిని అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దాదాపు ఐదు దశాబ్దాలుగా వెంకటేశ్వర రెడ్డి తెలుగు సాహిత్యానికి విశేషమైన కృషి చేశారన్నారు. తెలుగు విశ్వ విద్యాలయం నుండి కీర్తి పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ పురస్కారం, శాతవాహన విశ్వవిద్యాలయం ఉత్తమ కవి పురస్కారాలను అందుకున్నాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు నారాయణ రెడ్డి తిరుమలేష్ పాల్గొన్నారు.

అధ్యాపకుడిని అభినందించిన డీఐఈఓ

ఆత్మకూర్: ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న గణిత లెక్చరర్ నారాయణచారి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎర్ర అంజయ్య అభినందించారు. శనివారం జిల్లాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో టీజీపీఎస్సీ నుంచి కొత్తగా విధుల్లో చేరిన నారాయణచారి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గణితంలో డాక్టరేట్ సాధించడం అభినందనీయమని కొనియాడారు.

ఘనంగా శ్రావణ అమావాస్య పూజలు



అచ్చుతాపురంలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



మదనాపురంలో ఆంజనేయస్వామి మూల విరాట్

మదనాపురం/వనపర్తి రూరల్/అమరచింత/ఖిల్లా ఘనపురం/ఆత్మకూర్/కొత్తకోట రూరల్: మదనాపురం మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ అమావాస్య సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. చివరి అమావాస్య కావడంతో వేద పండితులు జోషిగోపాలకృష్ణ గురుస్వామి స్వామివారికి పంచామృత అభిషేకం, మంగళహారతి కార్యక్రమాలను జరిపించారు. అనంతరం పట్టణం నడిబొడ్డున ఉన్న ఆంజనేయస్వామి భారీ విగ్రహానికి ప్రత్యేక పూజలతో పాటు ధూపదీప నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రజితశెట్టి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

■ వనపర్తి మండలంలోని అచ్చుతాపురం గ్రామంలోని గుంటి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని అర్చకులు నవీన్‌కుమార్‌శర్మ స్వామివారికి అభిషేకం, అర్చన, నైవేద్యం, మహామంగళ హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నరేందర్‌స్వామి, రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

■ ఆత్మకూర్ మండల పరిధిలోని బాలకిష్టాపూర్, పిన్నంచర్ల తదితర గ్రామాల్లో భక్తులు కృష్ణానది జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయాల్లో అభిషేకం నిర్వహించారు.

■ అమరచింత మండలంలోని మస్తీపురం, చింతరెడ్డిపల్లే, పాంరెడ్డిపల్లె, కిష్టంపల్లి, సింగంపేట తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సింగంపేటబాట ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం. రామ్మోహన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి పూజల అనంతరం అన్నప్రసాద వితరణ పాల్గొన్నారు.

■ ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేతా వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక చేశారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. గుట్ట కింది భాగాన కర్నాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా చిక్కు సూగూర్‌కు చెందిన వాసశ్వేత శ్రీనువాసశెట్టి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

■ కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ సమీపంలోని ప్రసిద్ధ కోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో శ్రావణ అమావాస్య సందర్భంగా శనిగ్రహ సహిత రుద్ర హోమం నిర్వహించారు. శతస్వాహా కారాలతో పూర్ణాహుతి సమర్పించి, కూష్మాండ బలి ఇచ్చారు. భక్తులు శివకోటి యంత్రాల ద్వారా కోటిలింగాల ప్రతిష్ఠలో భాగస్వాములయ్యారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పెద్దగుడెంలో శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి రూరల్/వనపర్తి: పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శనివారం వనపర్తి మండలం ,పెద్దగుడెం, పెద్దగుడెంతండా, నాచహల్లి, శ్రీరంగాపురం, నాగసానిపల్లిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. నాచహల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ భవనానికి ,పెద్ద గుడెం గ్రామంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ అలాగే పెద్దగుడెం తండాలో గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వనపర్తి నియోజకవర్గాన్ని దత్తత తీసుకున్నారని ఈ క్రమంలో నియోజకవర్గానికి అదనంగా మరో 3500 ఇళ్లు కావాలని కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాక పేదల సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ ఇళ్లు ,రేషన్‌కార్డులు, సన్నబియ్యం, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రమోదినిరెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్‌నాయక్, రవికిరణ్ ,శ్రీహరిరాజు, బీరం యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి

వనపర్తిటౌన్: ఇటీవల జరిగిన గెజిటెట్ ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో భాగంగా జిల్లాలో 22 మంది పదోన్నతి పొందారు.ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆకుల శివాజీ అదే పాఠశాలకు గెజిటెట్ ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు. ఈ క్రమంలో శనివారం బాధ్యతలు స్వీకరించగా పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాతో సన్మానించి గ్రీన్ పెన్‌ను బహుకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్ రెడ్డి, రవి ప్రసాద్ గౌడ్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టలక్ష్మి మహాపూజ

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా అష్ట వరసిద్ధి-అష్టదళ- అష్టలక్ష్మి మహాపూజ వైభవంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు భీమా చంద్రకాంత్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసమూర్తి వేద మంత్రోచ్చరణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎనిమిది మండపాలను ఏర్పాటు చేసి, వాటిని ఎనిమిది వర్ణాలతో అలంకరించారు.

అంతరిక్ష పరిశోధనలో దూసుకుపోతోంది

వనపర్తిటౌన్: దేశం అంతరిక్ష పరిశోధనలో దూసుకుపోతోందని ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎంఆర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గగనయాన్ ఉపగ్రహాలతో అభివృద్ధి చెందిన దేశాలతో దేశం పోటీగా నిలుస్తుందన్నారు. సామాజిక, ఆర్థిక, సైనిక రంగాల్లో పరిశోధనలు, అభివృద్ధితో దేశం పటిష్టంగా మారుతుందన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

కొత్తపల్లి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణారావ్ సూచించారు. మండల పరిధిలోని మన్నాపూర్ గ్రామంలో 13 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా నిర్మాణాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపడితే ప్రభుత్వం విడతల వారిగా నగదు జమచేస్తుందన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఉద్యమిస్తాం



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: మంత్రి జూపల్లి జూరాల నుంచి కొల్లపూర్‌కు నీటిని అక్రమంగా తరలించుకుపోతూ ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆత్మకూర్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు పడరాని కష్టాలు పడుతున్నారని, యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియా తెప్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలన అవినీతిమయంగా మారిందని ప్రజల బాగోగులను పట్టించుకోకుండా స్వలబ్ధికోసమే పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కావలసినంతా యూరియా సరఫరా చేయాలని లేనిపక్షంలో రైతులతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగడ్, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షుడు రవికుమార్, రమేశ్, మాజీ వైస్ఎంపీపీ కోటేష్, నాయకులు విష్ణువర్దన్‌రెడ్డి, అంజీ, రియాజ్‌అలీ, శేఖర్, జాహంగీర్, సోంబాబు, రమేష్, సోంబాబు, షరీఫ్ ఉన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్ల నుంచి చాకల్‌పల్లికి బీటీ రోడ్డు నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఏదుట్ల, చాకల్‌పల్లి మధ్య బీటీరోడ్డు నిర్మించాలని కోరుతూ చాకల్‌పల్లి గ్రామంలో పాదయాత్ర చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రేమొద్దుల, మాచుపల్లి, సింగాయిపల్లి, చెన్నారం, చీర్కపల్లి, ఏదుల, పాన్‌గల్ మండలంలోని పలు గ్రామాలకు చెందినవారు నాగర్‌కర్నూల్ వెళ్ళాలంటే ఏదుట్ల, చాకల్‌పల్లి మీదుగా వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు ఈ రోడ్డును బీటీరోడ్డుగా మారుస్తానని హామీ ఇచ్చారని ఆమేరకు వెంటనే బీటీ రోడ్డు, అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి, మండల ఇన్‌చార్జీ కదిరెమధు, జనరల్ సెక్రెటరీ శివ, అరవింద్‌రెడ్డి, వామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమాచార కమిషనర్ల పూజలు

వనపర్తి రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని రంగనాథ ఆలయాన్ని శనివారం రాష్ట్ర సమాచార కమిషనర్లు శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, వైష్ణవి మెర్ల దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. తహసీల్దార్లు రాజు, మురళీగౌడ్, ఎస్ఐలు యుగందర్‌రెడ్డి ,రామకృష్ణ ,ఆర్ఐలు ఉన్నారు.

దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర



వనపర్తి అంబేడ్కర్ చౌరస్తాలో సురవరానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అమరచింతలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత/వీపనగండ్ల/వనపర్తి రూరల్/పాన్‌గల్: దేశ రాజకీయాల్లో సురవరం చెరగని ముద్ర వేశారని సీపీఐ పట్టణ కార్యదర్శి రవీందర్ అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై శనివారం అమరచింత పట్టణంలోని సీపీఐ జెండాకట్ట వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలమూర్ బిడ్డగా దేశ రాజకీయాల్లో అగ్ర పదవులను అధిరోహించడమే కాకుండా నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతో తనవంతు పాత్ర పోషించేవారన్నారు. సుధాకర్‌రెడ్డి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

■ పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి, వెంగళాయిపల్లి గ్రామాల్లో సీపీఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించారు.

■ వీపనగండ్ల మండల కేంద్రంలో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్ ఘన నివాళి అర్పించారు. పేదల అభ్యున్నతి కోసం సుధాకర్‌రెడ్డి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కురుమయ్య, నాయకులు గోపాలకృష్ణ, చలమారెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

■ సురవరం సుధాకర్‌రెడ్డి మరణించిన ఆయన సమ సమాజ ఆశయం, ఎజెండా మరణం లేనిదని వనపర్తి సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పలువురు నాయకులతో కలసి ఆయన సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో కళావతమ్మ, కవి జనజ్వాల, రిటైర్డ్ ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

■ ఆత్మకూర్ గాంధీచౌక్‌లో సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణశెట్టి, రాజు, ప్రసాద్, రాబర్ట్, మోష, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



నల్ల చెరువు కట్టను శుభ్రం చేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

వనపర్తిటౌన్: పట్టణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో 100 రోజుల కార్యచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త విభజనపై, సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం వనమహోత్సవం తోటల పెంపకం, వాటర్ క్లోరినేషన్ పరీక్ష, నీటి పన్ను వసూలు, రోడ్ల పక్కన కలుపు తీసి పొదలను తొలగించడం, నల్ల చెరువు కట్ట పైన క్లీన్ చేయడం, కాలువల్లోని డెసిల్ట్ తొలగించే పనులను దగ్గరుండి పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడ్

వనపర్తి రూరల్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు ఆదేశం మేరకు శనివారం పెబ్బేరు మండల బీజేపీ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హామీలు నెరవేర్చాలని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.పెబ్బేరు నుంచి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై రెండు లోలెవల్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుందని, బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలో నిలిచి పోయాయన్నారు. ప్రజా ప్రతినిధులు ,జిల్లా అధికారులు స్పందించి పనులకు బిల్లులు మంజూరు చేయాలన్నారు. అలాగే జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు నాగరాజుయాదవ్ భగవాన్ దాస్, రంగస్వామిగౌడ్ కంచె ఆంజనేయులు , సర్వేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

యోగా, ధ్యానంపై విద్యార్థులకు అవగాహన



పానగల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టెలిమానస్ ట్రైనర్ సువర్ణ

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు టెలిమానస్ ట్రైనర్ సువర్ణ ఆధ్వర్యంలో ధ్యానం, యోగాపై శనివారం అవగాహన కల్పించారు. ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంచడానికి యోగా, ధాన్యం ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సాధన చేయడం వలన జ్ఞాపకశక్తిని మెరుగుపర్చడం, భావోద్వేగాలను నియంత్రించడం, స్వీయ అవగాహన, విశ్వాసం, స్వీయ నియంత్రణను పెంచుతాయన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

వీపనగండ్ల: విద్యార్థులు క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వల్ల సృజనాత్మక శక్తి పెరుగుతుందని స్థానిక ప్రభుత్వ కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ కల్పన అన్నారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ధ్యానంతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ధ్యానంతో ఒత్తిడి తగ్గుతుందని మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి రోజూ ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివగౌడ్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పాన్‌గల్: కార్యకర్తలు, నాయకులు స్థానిక ఎన్నికలల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరసాగర్ అన్నారు. శనివారం మండలంలోని గోప్లాపూర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మండల పార్టీ అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే భీరం హర్షవర్దన్‌రెడ్డి సహకారంతో స్థానిక ఎన్నికలల్లో అత్యధిక స్థానాలు గెలిచే విధంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ మిద్దె కృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గంధం లక్ష్మయ్య, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మనోహర్‌గౌడు, అడవన్న, రాజు, ఆశోక్, రాజేందర్, శ్రీనివాసులు, స్వామి, నర్సింహ్మా, గొల్ల స్వామి, పెద్ద నాగులు పాల్గొన్నారు.

యూరియాపై వదంతులు నమ్మొద్దు



యూరియా కోసం బారులు తీరిన రైతులు

పాన్‌గల్: యూరియా కొరత ఉందని సృష్టిస్తున్న అపోహలను నమ్మి రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని యూరియా పుష్కలంగా అందుబాటులో ఉందని సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడు పేర్కొన్నారు. శనివారం మండల సింగిల్ విండో కార్యాలయానికి 450 బస్తాల యూరియా లోడ్ వచ్చిందనే విషయం తెలుసుకున్న రైతులు భారీగా కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చిన రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందజేశారు. వదంతులు నమ్మి అధికంగా యూరియా కొనుగోలు చేసి ఇళ్లల్లో భద్రపరచుకోవద్దని సూచించారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ధి ఉత్సవాలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాదం సరోజిని దేవి కల్యాణ మండపంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఖిల్లాఘనపురం ఖండ ప్రముఖ్ భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి విజయదశమి నాటికి 100 ఏళ్లు పూర్తి కావొస్తుండడంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని హిందు బంధువులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితురాలికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న నాయకులు

మదనాపురం: మదనాపురం మండలంలోని రామన్ పాడు, అజ్జకొల్లు, గ్రామానికి చెందిన షాకీరాకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.24 వేల చెక్కును ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల నాయకులు అందజేశారు. షాకీరా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యచికిత్సకు సాయమందించాలని సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.24వేలు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమం లో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంకట్ నారాయణ, మండల కో ఆర్డినేటర్ సుక్క మహేష్, గ్రామ ఇన్‌చార్జ్‌లు మహదేవన్ గౌడ్, వడ్డె రాములు, శ్రీధర్ రెడ్డి, కురుమూర్తి రాయ లిఫ్ట్ చైర్మన్ రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో షెడ్డు నిర్మాణానికి అంగీకారం



కొత్తపల్లి మాసన్నను సన్మానిస్తున్న అర్చకులు

మదనపురం: మండలంలోని కురుమూర్తి స్వామివారి దిగువమెట్ల షెడ్డు నిర్మాణానికి కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అనిమోని మాసన్న యాదవ్ ముందుకొచ్చారు. శనివారం శ్రావణమాసం చివరి అమావాస్య సందర్భంగా కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్న ఆయన ఆలయ అర్చకుల సూచన మేరకు సొంత ఖర్చులతో స్వామివారి దిగువ మెట్ల రేకుల షెడ్డు నిర్మించడానికి అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, పాలక మండలి సభ్యులు చారి, ఆలయ సిబ్బంది సదానంద చారి తదితరులు పాల్గొన్నారు.